క్లుప్తంగా

మైసమ్మ నూతన చైర్మన్‌గా కృష్ణయ్య?

నవాబుపేట: మండలంలోని కాకర్లపహడ్ పంచాయతీ పరిధిలోగల మైసమ్మ ఆలయానికి సంబంధించి చైర్మన్ ఉన్న గోపాల్ పదవీకాలం గత నెల ముగిసింది. దీంతో నోటిఫికేషన్ జారీ అయ్యింది. తాజాగా ఏర్పాటు చేసే కమిటీకి సంబంధించి తుది జాబితాను జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఖరారు చేసి సంబంధిత శాఖకు పంపించారు. ప్రసిద్ధిగాంచిన పర్వతాపూర్ మైసమ్మ ఆలయ నూతన చైర్మన్‌గా కాకర్లపహడ్‌కు చెందిన పాశం కృష్ణయ్యను ఖరారు చేశారు. అసెంబ్లీ సెషన్స్‌లోనే ఆమోదం లభించనుండగా, త్వరలో నూతన చైర్మన్ కృష్ణయ్య ఆధ్వర్యంలో అదే గ్రామానికి చెందిన 14మంది సభ్యుల కొత్త పాలకవర్గం కొలువుదీరనుంది.

ఎల్‌ఓసీ అందజేత



దేవరకద్ర: మండలంలోని గద్దెగూడెం గ్రామానికి చెందిన ఎల్.లక్ష్మమ్మ చికిత్స కోసం రూ.4.50లక్షల ఎల్‌ఓసీని శనివారం బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అందజేశారు. లక్ష్మమ్మ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, గతంలో రూ.2.50లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. చికిత్సకు సరిపోకపోవడంతో అదనంగా రూ.2లక్షల ఎల్‌ఓసీని అందజేశారు.

ఎమ్మెల్యేకు సన్మానం..

దేవరకద్ర: వాల్మీకి బోయల ఎస్టీ జాబితా బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేయడంలో కృషి చేసిన ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని నియోజకవర్గంలోని వాల్మీకి బోయ నాయకులు శనివారం హైదరాబాద్‌లో కలిసి ఘనంగా సన్మానించారు. ఎస్టీ బిల్లుకు మద్దతుగా నిలిచి పాస్ చేయించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

14న మండల సర్వసభ్య సమావేశం

బాలానగర్: ఈనెల 14న ఎంపీపీ కమల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణారావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అందుకుగాను మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల కోఆప్షన్ మెంబర్లు, ఆయా శాఖల అధికారులు నివేదికలతో హాజరవ్వాలని సూచించారు.

ఆర్థికసాయం అందజేత

రాజాపూర్: మండలంలోని చెన్నవెల్లికి చెందిన మహ్మద్‌రఫీక్ కూతురు సానాబేగం కూతురు వివాహానికి శనివారం ఎంపీటీసీ అభిమన్యూరెడ్డి యువసేన ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థికసాయం సర్పంచ్ రాధా అందజేశారు. మండల కేంద్రానికి చెందిన జంగయ్య కూతురు పుష్ప వివాహానికి రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, విజయ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి శివభక్తుల పాదయాత్ర

భూత్పూర్: మహాశివరాత్రి సందర్భంగా వారం రోజులుగా శ్రీశైలానికి భక్తులు వందలాదిగా పాదయాత్రగా తరలివెళ్తున్నారు. ఇరుముడిని తల, భుజాలపై పెట్టుకొని శివశివ అంటూ తాండూర్, పరిగి, యాద్గీర్, నారాయణపేట, కొడంగల్‌తో పాటు మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన శివమాల ధరించిన భక్తులు వందలాదిగా మంది పాదయాత్రగా శ్రీశైలానికి వెళ్తున్నారు.

మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



భూత్పూర్: మండలంలోని పోతులమడుగులో శనివారం మండల స్థాయి క్రికెట్ పోటీలను డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. మద్దిగట్లకు చెందిన కాంగ్రెస్ నాయకుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాస్ఫూర్తితో యువకులు క్రీడల పట్ల ఆసక్తి చూపాలన్నారు. మొదటి బహుమతి రూ.20వేలు, రెండో బహుమతి రూ.10వేలు, మూడో బహుమతి రూ.5వేలు అందజేయనున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రాష్ట్ర నాయకుడు సాధిక్, మాజీ సర్పంచ్ కొండయ్య, పోతులమడుగు ఎంపీటీసీ ఊశయ్య, హర్యానాయక్ పాల్గొన్నారు.

ఎటు చూసినా గుంతలే

- కొత్త కాలనీల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలు కరువు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న మట్టిరోడ్డు



ఎదిరలోని కుర్వగేరిలో గుంతలుగా మారిన సీసీ రోడ్డు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని 4వ వార్డు పరిధిలో మిషన్ భగీరథ పైపులైన్ కోసం సీసీ రోడ్లు, బీటీ తవ్వి అలాగే వదిలేడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎదిరలోని శ్రీభక్త ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో తాగునీరు వృథా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ కొన్ని రోజులుగా పైపులైన్ లీకేజీ అవుతోందన్నారు. కుర్వగేరి, కిందిగేరిలో పరిస్థితి అధ్వానంగా తయారైంది. వీధుల్లో కనీసం చెత్తను తీసేందుకు ట్రాక్టర్ సైతం వచ్చే పరిస్థితి లేదు. చెత్త కుండీలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో చెత్తను ఊరచెరువు వద్ద పారబోస్తున్నారు. రోడ్ల వెంట గతంలో నాటిన మొక్కలు పెద్దవై విద్యుత్ స్తంభాలకున్న తీగలకు తగులుతున్నాయి. హౌసింగ్‌బోర్డు కాలనీలో నాలుగు ప్రధాన వీధులున్నాయి. సీసీరోడ్లు చాలావరకు దెబ్బతిన్నాయి. ఇంకా కొన్ని చోట్ల మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. సుమారు 26ఏళ్ల కిందట నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ ఇప్పటి అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదు. కాలనీ మధ్యలో నుంచి పోసోనికుంట పెద్దకాల్వ ప్రవహిస్తోంది. జిల్లా కేంద్రానికి శివారున ఉండటంతో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. బైపాస్ నుంచి ఎదిరకు వెళ్లే ప్రధాన రోడ్డుకు ఎడమ వైపు తిరుమల కాలనీ, కుడివైపు వినాయకనగర్ కొత్తగా ఏర్పడ్డాయి. ఈ రెండు కాలనీల్లో వందలాది ఇళ్ల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఆ మేరకు సీసీరోడ్లు, డ్రెయినేజీలను నిర్మించాల్సి ఉంది. అలాగే తాగునీటి సౌకర్యం కల్పించి, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది.

వార్డు 4	జనాభా 6,337
కాలనీలు	ఎదిర, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, హౌసింగ్ బోర్డు (కొంత భాగం), తిరుమలకాలనీ, వినాయకనగర్

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి..



జిల్లా కేంద్రానికి శివారులో ఉండటంతో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి. కాలనీలో పోలీసుల పహారాతో పాటు ఎప్పటికప్పుడు పెట్రోలింగ్ నిర్వహించాలి. నాలుగు ప్రధాన వీధుల్లో 20 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గతంలో కలెక్టర్ దృష్టికి తెచ్చాం.

– బి.యాదయ్యగౌడ్, సంక్షేమ సంఘం అధ్యక్షుడు, హౌసింగ్‌బోర్డు కాలనీ

రోడ్లు మరమ్మతు చేపట్టాలి..



మూడేళ్ల కిందట మిషన్ భగీరథ పథకం కోసం సీసీ రోడ్లను తవ్వించి నీటి పైపులు వేసిన అధికారులు గుంతలను మాత్రం సరిగా పూడ్చలేదు. మరమ్మతు చేపట్టాలి. డ్రెయినేజీల్లో చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదు. వీధుల్లో యథేచ్ఛగా తిరుగుతున్న పందులను తరిమివేయాలి.

– సంతోష్‌కుమార్, కుర్వగేరి, ఎదిర

సమస్యలను పరిష్కరిస్తాం..



వార్డులో నెలకొన్న సమస్యలను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సహకారంతో పరిష్కరించేందుకు కృషి చేస్తాం. ప్యాచ్ వర్క్ కింద మంజూరైన రూ.ఐదు లక్షలతో రోడ్ల మరమ్మతు చేపడతాం. ఇప్పటికే తిరుమలకాలనీలో రూ. 21.90లక్షలతో మిషన్ భగీరథ పైపులైన్ పనులు చేపట్టాం. ఎదిరలో రజక భవన్ కోసం రూ.10లక్షలు మంజూరయ్యాయి.

– తోకల యాదమ్మ, కౌన్సిలర్

ఉపాధ్యాయుల సంక్షేమమే ముఖ్యం



ఎదిర పాఠశాలలో మాట్లాడుతున్న ఏవీఎన్ రెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎస్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లో ఆయన శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 317 జీవో ద్వారా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. పండిట్, పీఈటీలను వెంటనే అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు ఇబ్బందిగా ఉన్న ఏకీకృత సర్వీస్‌రూల్స్‌ను సాధించేందుకు తమ వంతు కృషి చేస్తాన్నారు. కేజీబీవీ ఉద్యోగులకు టైం స్కేల్ ఇవ్వాలని, ఇతర ఉద్యోగుల మాదిరి వారికి కూడా సీఎల్స్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తపస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీల్‌కుమార్, బాబునాయుడు, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కరుణాకర్‌గౌడ్, రాజమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసులు రాజీ

మిడ్జిల్: జడ్చర్ల జ్యుడిషియల్ మెజిస్ట్రేట్‌లో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో కక్షిదారులకు, అర్జీదారుల మధ్య ఒప్పందం కుదుర్చుకొని 32కేసులను రాజీ చేసుకున్నట్లు ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపిస్తూ పట్టుబడిన కేసుల్లో 36 కేసులకు జరిమానా విధించి కేసులను కొట్టి వేసినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని న్యూరిషి పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. పలువురు విద్యార్థులు తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించి అలరించారు. మొదటి బహుమతి అనుశ్రీ, శివాత్మిక, రెండో బహుమతి శ్రీ చైత్రిక, జాహ్నవీ, మూడో బహుమతి శ్రీచేతన్, యశస్వినిలకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అందించి అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు శిరీష, పూజిత, చంద్రకళ, సుశాంత్‌కృష్ణ, ప్రిన్సిపాల్ రామకృష్ణ, మల్లికార్జున్, వైస్ ప్రిన్సిపాల్ పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా విగ్రహ ప్రతిష్ఠాపన



పెద్దాయపల్లిలో సాయినాథుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

బాలానగర్: మండలంలోని పెద్దాయపల్లి శివారులోని దుందుభీ నది తీరాన శ్రీ షిరిడీసాయి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శనివారం వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. గుండేడ్ సర్పంచ్ నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులు, సీఎండీ రఘుమారెడ్డిలతో పాటు మరికొందరు భక్తుల తోడ్పాటుతో షిరిడీ సాయి దివ్య ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ఆలయ ధర్మకర్త సట్టి నర్సింహారెడ్డి నిర్మింపజేశారు. రెండు రోజులుగా యాగాలు, ప్రత్యేక పూజలు చేసిన వేద పండితులు శనివారం ఉదయం 8:45గంటలకు ఎంతో భక్తిశ్రద్ధలతో శిరిడీసాయి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజులుగా అన్నదాన కార్యక్రమాలతో పాటు ఇతర కార్యక్రమాలు, భజనలతో ఆలయ పరిసరాలు సాయిమహిమతో తన్మయత్వంలో మునిగిపోయాయి.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు..

సాయినాథుడి విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు వారిని దీవించారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

జడ్చర్ల: ఆధ్యాత్మిక చింతన, భక్తి భావనను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఎమ్మెల్యే సి.లక్ష్మారెడ్డి తెలిపారు. శనివారం రంగారావుతోటలోని బ్రహ్మకుమారీ రాజయోగ సేవా కేంద్రంలో ఓంశాంతి 87వ శివ జయంతి మహాశివరాత్రి వారోత్సవాలను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మిక అలవర్చుకోవడం వల్ల మానసిక ఒత్తిడిని జయించగలుగుతామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, వార్డు కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండిత్ దీన్ దయాళ్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

మిడ్జిల్: పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని శనివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, బీజేపీ మండల అధ్యక్షుడు నరేందర్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తిరుపతి, నాయకులు రామకృష్ణ, నరేష్, ఆంజనేయులు, శ్రీనివాస్, సతీష్‌గౌడ్, లింగం తదితరులు పాల్గొన్నారు.

కందూరులో వైద్యశిబిరం



కందూర్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

అడ్డాకుల: మండలంలోని కందూర్‌లో శనివారం ఎస్‌వీఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 200 మందికి షుగర్, కంటి, ఎముకలు, నరాలు, ఈఎన్‌టీ, ఈసీజీ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా, 10 మంది దాతలు రక్తదానం చేశారు. కంటి సమస్యలు ఉన్న వారు నేరుగా ఎస్‌వీఎస్ ఆస్పత్రికి వస్తే ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని ఎస్‌వీఎస్ ఆస్పత్రి యాజమాన్యం ప్రకటించింది. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీకాంత్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను గాలికొదిలేశారు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రభుత్వ విద్యా విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికొదిలేశాయని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. శనివారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లడారు. ప్రభుత్వ విద్యను పక్కనపెట్టి ప్రైవేట్, కార్పొరేట్ విద్యావిధానానికి వత్తాసు పలికేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు కేటాయించిన బడ్జెట్‌లను చూస్తేనే తెలిసిపోతుందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యకు 2.6 శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 6.57 శాతం నిధులు మాత్రమే కేటాయించి విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేశారన్నారు.

ప్రిన్సిపాల్‌పై దాడి

మహబూబ్‌నగర్ క్రైం: షాషాబ్‌గుట్టకు చెందిన ఖాజాహుస్సేన్ 2009నుంచి పట్టణంలోని షాషాబ్‌గుట్టలో ఉన్న కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి పాఠశాలకు రెగ్యులర్‌గా రావడం లేదని మందలించడంతో శనివారం ఆ విద్యార్థి తల్లిదండ్రులు మహ్మద్ అరీఫ్, సాజిదాబేగంతో పాటు ఇతర బంధువులు కలిసి ఖాజా హుస్సేన్‌పై దాడి చేసి కొట్టారు. దెబ్బలు బలంగా తగలడంతో అతను అక్కడే కుప్పకూలిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పాటు పాఠశాలలో ఉన్న ఫర్నీచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు ధ్వంసం చేశారు. బాధితుడి కొడుకు మహ్మద్ అల్తాఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు.

అభివృద్ధికి ప్రభుత్వం కృషి



జడ్చర్లలో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మి

జడ్చర్ల టౌన్: పట్టణంలో పదో వార్డులో సీసీరోడ్డు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి శనివారం ప్రారంభించారు. పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు చైర్‌పర్సన్ సూచించారు. అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కుమ్మరి రాజు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నవాబుపేట: మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులను చేస్తున్నట్లు సర్పంచ్ యాదయ్య తెలిపారు. ఇందుకు సంబంధించి పనులు శనివారం ప్రారంభించారు.

మహమ్మదాబాద్: ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేస్తుందని జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని ముందలి తండాలో రూ.5లక్షల నిధులతో సీసీరోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో పల్లెలు అభివృద్ధికి నోచుకోక ప్రజలు ఎన్నో అవస్థలు పడినట్లు గుర్తుచేశారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ పచ్చని పల్లెలుగా మార్చడంతో పాటు అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారని వెల్లడించారు. తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేసి అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలేష్‌నాయక్ పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ కరాటే టోర్నీలో పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో మాస్టర్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: విశాఖపట్నంలో జరుగుతున్న ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో కింగ్ షోటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. ఆదివారం జరిగిన ఆయా పోటీల్లో అండర్–13 విభాగం కటాస్‌లో సాయి ప్రణీత్, షేక్ అర్సన్‌లు బంగారు పతకాలు, అండర్–12 విభాగంలో మహ్మద్ సాబేర్‌పాష, మహ్మద్ అబ్దుల్ ఖుద్దూస్ కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులకు కరాటే మాస్టర్లు రవాన్, ఎస్‌కేడీఏ అధ్యక్షుడు కేఎల్ఎం శాస్త్రీ, రవి, మిర్జా ఇబ్రహీంలు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ అభినందించారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

చిన్నచింతకుంట: బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు సుదర్శన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు కార్యకర్తలకు సూచించారు. శనివారం మండలంలోని అమ్మపూరంలో ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారంలో విఫలమైందన్నారు. నియంత పాలన కొనసాగిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. బీఆర్‌ఎస్ నియంతపాలనకు చమరగీతం పాడే సమయం ఆసన్నమైందన్నారు. అందుకు ప్రతి కార్యకర్త సైనికునిల్లా పనిచేసి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దశరథ్, నాయకులు బాల్‌చందర్, నాగేందర్, మనోహర్, మహేష్, శ్రీహరి పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉద్యోగుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉద్యోగ సంఘాల నాయకులు ఆన్‌డ్యూటీ సౌకర్యం పొంది, ప్రభుత్వానికి పాలాభిషేకాలు, బాణాసంచా పేల్చుతూ సమస్యలను పక్కదారి పట్టించడం మానుకోవాలని కోరారు. రాష్ట్రంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల ప్రధాన సమస్యలు డీఏ, పీఆర్‌సీ ఏరియర్స్ నిలుపుదల, ఈ–కుబేర్‌లో నిలిచిపోయిన జీపీఎఫ్, సరెండర్ లీవ్, నూతన పీఆర్‌సీ కమిషన్ నియామకంపై అసెంబ్లీ సమావేశాల్లో ఎంఐఎం పక్షనాయకుడు అక్బరుద్దీన్ ఓవైసీ ప్రస్తావించడంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల ఆర్థిక సమస్యలను పరిష్కారించాలని కోరారు. సమావేశంలో ఆల్‌మేవా రాష్ట్ర ఉపాధ్యక్షులు సయ్యద్ వహీద్‌షా పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): గొర్రెల పెంపకందారుల సహకార సంఘం క్యాలెండర్‌ను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ శనివారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గొల్ల కురుమల సంక్షేమం కృషి చేస్తుందని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో గొల్ల కురుమలను పట్టించుకున్న దాఖలాలు లేవని, ప్రస్తుతం సంక్షేమ పథకాల్లో పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శాంతన్నయాదవ్, వైస్ చైర్మన్ బాలమణియాదవ్, డైరెక్టర్లు వెంకటేష్‌యాదవ్, రాజగోపాల్‌యాదవ్, లక్ష్మణ్, మహేశ్వర్, రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ గోపాల్‌యాదవ్, ముడా డైరెక్టర్ సాయిలేయాదవ్, కౌన్సిలర్ నరసింహాయాదవ్, హన్వాడ మండల రైతుబంధు అధ్యక్షుడు రాజుయాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెన్నయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.